
# నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, బుధవారం 26 జూన్ 2024 | NAGARKURNOOL




## ..అనే నేను..

- లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన మల్లు రవి

నాగర్‌కర్నూల్, జూన్ 25 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మంగళవారం లోక్‌సభలో పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణం చేశారు. కందనూలు ఎంపీగా ముచ్చటగా మూడోసారి గెలుపొందారు. ఈ మేరకు లోక్‌సభలో భారత రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. చివరన జై హింద్.. జై తెలంగాణ.. జై కాన్సిస్ట్యూషన్.. జై భీమ్.. అని అన్నారు.





గద్వాలలో ఎంఏఎల్‌డీ స్పార్క్ పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల, ప్రిన్సిపాల్

## కళాశాల అభివృద్ధికి విశేష కృషి

- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల టౌన్, జూన్ 25 : మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తనవంతు విశేష కృషి చేస్తానని కళాశాల అల్యూమిని చైర్మన్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ కళాశాలలో మంగళవారం ఎంఏఎల్‌డీ స్పార్క్ రీసర్చ్ ఆర్టికల్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో మేధావులను తయారు చేసిన ఘనత ఎంఏఎల్‌డీ కళాశాలకు ఉందన్నారు. తాను కూడా కళాశాల పూర్వ విద్యార్థి కావడం అదృష్టమన్నారు. కళాశాల పేరును నలుదిశలా చాటిన పూర్వ విద్యార్థులను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎంతో కృషి చేసి రూపొందించిన ఎంఏఎల్‌డీ స్పార్క్ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైందని వివరించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే మహిళల విశ్రాంతి గది కలరింగ్ కోసం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, అల్యూమిని జనరల్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కలందర్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు కృష్ణమూర్తి, శివారెడ్డి, మనోజ్, హరి నాగభూషణం, మంజులత, కౌన్సిలర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు హామీని నిలబెట్టుకోవాలి

- అయిజలో ఆసరా లబ్ధిదారుల రాస్తారోకో
- పాత పింఛన్లే నెలనెలా ఇవ్వడం లేదని ఆవేదన


అయిజ పాతబస్టాండ్‌లో రాస్తారోకో చేస్తున్న లబ్ధిదారులు

అయిజ, జూన్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.రెండు వేలు ఉన్న పింఛన్‌ను నాలుగు వేలు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.ఆరువేలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు ఏర్పాటు చేసి ఏడునెలలు కావస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో నెలనెలా మొదటి వారంలోనే పింఛన్లు వచ్చేవని, కాంగ్రెస్ సర్కారొచ్చినంక నెల ముగుస్తున్నా పింఛన్లు పడడంలేదని ఆరోపించారు. పింఛన్ పెంచేది దేవుడెరుగు పాత పింఛన్లు అయినా నెలనెలా ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. మంగళవారం అయిజ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో అయిజ, గద్వాల రహదారిపై పింఛన్ల పెంపు, నెలనెలా పింఛన్లు ఇవ్వడం లేదని ఆసరా లబ్ధిదారులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆసరా పింఛన్లు డబుల్ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాడని, ఎన్నికల్లో గెలుపొంది ఏడు నెలలు కావస్తున్నా పింఛన్లపై మాట నిలబెట్టుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నెలనెలా పింఛన్లు వస్తే మందులు, మాకులు తెచ్చుకొనేవాళ్లమని, సకాలంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసరా లబ్ధిదారులకు మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి రాస్తారోకోలో పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఇచ్చిన మాటకు కట్టుబడి లబ్ధిదారులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎస్సై విజయ్‌భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకొని లబ్ధిదారులకు నచ్చచెప్పి విరమింపజేశారు.

## డీటీవో కార్యాలయంలో సర్వర్ సమస్య


- రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో వాహనదారుల ఇబ్బందులు


కార్యాలయం వద్ద వాహనదారుల పడిగాపులు

నాగర్‌కర్నూల్, జూన్ 25 : జిల్లా కేంద్రంలో రవాణాశాఖ కార్యాలయంలో కొంత కాలంగా సర్వర్ సమస్య పీడిస్తోం ది. దీంతో సమయానికి రిజిస్ట్రేషన్లు కాక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి సమస్యే మంగళవారం కూడా ఎదురైంది. రెండురోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్నెట్ రాకపోవడంతో పలు వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనదారులు అసహనానికి గురయ్యారు. సర్వర్ రాకపోవడంతో ఒక్క రిజిస్ట్రేషన్ కోసం రెండు మూడు రోజులు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చి గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో జిల్లా రవాణా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తితోపాటు, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వాహన రిజిస్ట్రేషన్ కోసం, లైసెన్స్‌ల కోసం, రెన్యూవల్ చేయించుకునేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఇదివరకే పలుమార్లు కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి సమీపానికి మార్చాలను వాహనదారులు కోరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడం వల్లే నెట్‌వర్క్ సమస్య ఎదురవుతుందని, కరెంట్ సమస్య కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా కార్యాలయానికి సంబంధించిన ఇంటర్నెట్ బిల్లు చెల్లించకపోవడం వల్లే మంగళవారం సర్వర్ సమస్య ఎదురైందని పలువురు వాహనదారులు ఆరోపిస్తుండగా, వైర్లు తెగిపోయి చిన్నపాటి సమస్య వల్లే ఇంటర్నెట్‌లో సరఫరా నిలిచిపోయిందని జిల్లా రవాణా శాఖాధికారి బాలునాయక్ పేర్కొన్నారు.

## సీఎంఆర్ రైస్ త్వరగా అప్పగించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీ


మిల్లులోని ధాన్యం రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

వనపర్తి, జూన్ 25 : జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని త్వరగా అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి శివారులోని రాఘవేంద్ర ఇండస్ట్రీస్, చిట్యాల గోడౌన్, పెద్దమందడి మండలంలోని వీరాయిపల్లిలోని మల్లికార్జున ఇండస్ట్రీస్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిట్యాల గోడౌన్‌లో ఎస్పీఆర్ స్టాక్స్ తనిఖీ చేసి ధాన్యం నిల్వలను పరిశీలించారు. అలాగే రాఘవేంద్ర ఇండ్రస్ట్రీస్ రైస్ మిల్ వానకాలం 2023-24 సీజన్‌కి గానూ గత మార్చి నుంచి నేటికి 12ఏసీకేలు మాత్రమే డెలివరీ చేసిందని, మిగతా 43 ఏసీకేల ధాన్యాన్ని త్వరగా అప్పగించాలని చెప్పారు. అదేవిధంగా మిల్లింగ్ విషయంలో మిల్లర్లకు ఉన్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మల్లికార్జున ఇండస్ట్రీస్ 2022-23 వానకాలం సీజన్ కేవలం 11 ఏసీకేల ధాన్యం మాత్రమే అప్పగించారని, మిగతా ధాన్యం అప్పగించాలని లేని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ షేక్‌ఇర్ఫాన్, డీటీ నందకిశోర్‌తోపాటు పలువురు అధికారులు ఉన్నారు.

## మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


పవన్ (ఫైల్)

అచ్చంపేటరూరల్, జూన్ 25 : ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రంగాపూర్ గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన పుల్లగర్ల పవన్ అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. సోమవారం ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు రావడంతో తాను ఫెయిల్ అయినట్లు తెలుసుకొని తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం మృతదేహానికి అచ్చంపేట దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎస్సై రామును వివరణ కోరగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.


హన్వాడ మండలం టంకర రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

# రైతుకు భరోసా ఇవ్వాల్సిందే..

- అర్హులందరికీ పథకాన్ని వర్తింపజేయాలి
- స్కీమ్‌లో నిబంధనలు విధించొద్దు
- సాగు మొదట్లోనే సాయం అందాలి
- పదెకరాల్లోపు కర్షకులందరికీ ఇవ్వాలి
- కేసీఆర్ ప్రభుత్వం మాదిరి సబ్సిడీపై విత్తనాలు, పరికరాలు అందించాలి
- మనోగతాన్ని వెల్లడించిన అన్నదాతలు
- రైతు వేదికల్లో అభిప్రాయ సేకరణ
- కాంగ్రెస్ నేతల నోట రైతుబంధు మాట

**'రైతులకు భరోసా కల్పించాలి.. అర్హులందరికీ పథకాన్ని వర్తింపజేయాలి.. నిబంధనలు విధించొద్దు.. సాగు మొదట్లోనే సాయం అందాలి.. పదెకరాల్లోపు రైతులను, ఐటీ కడుతున్న వారిని సైతం అర్హులుగా గుర్తించాలి.. కేసీఆర్ ప్రభుత్వంలాగే సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి'.. అంటూ రైతులు మనోగతాన్ని వెల్లడించారు. రైతు భరోసాపై ప్రభుత్వం రైతులు, నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళ వారం ఉమ్మడి జిల్లాలోని పలు రైతు వేదికల్లో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించగా.. కర్షకులు హాజరై సమస్యలను ఏకరువు పెట్టారు. ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలని సర్కారుకు సూచించారు. పీఎం కిసాన్ సమస్యలపై నిలదీశారు.**

*- మహబూబ్‌నగర్, జూన్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

మహబూబ్‌నగర్, జూన్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు భరోసా కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు గురించి ప్రస్తావన చేయడం.. అది కాంగ్రెస్ నేతల నోటి వెంట రావడంతో అధికార యంత్రాంగం విస్తుపోయింది. రైతుబంధు మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన మండలకేంద్రాల్లోని రైతు వేదికల్లో అభిప్రాయ సేకరణను చేపట్టారు. ముందస్తుగా సమాచారం అందించి రైతులను సమీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్‌కు చెందిన మద్దతుదారులు చాలామంది హాజరయ్యారు. కొన్ని చోట్ల బీఆర్‌ఎస్‌కు సంబంధించిన నేతలు కూడా అభిప్రాయాలను వెల్లడించారు. ధన్వాడ రైతు వేదికలో ఓ కాంగ్రెస్ నేత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం లాగానే రైతుభరోసా కార్యక్రమాన్ని వర్తింపజేయాలని కోరడం గమనార్హం. రైతులు పంటలు పండిస్తేనే దేశం బాగుపడుతుందని మిగతా రంగాలన్నీ పుంజుకుంటాయని అభిప్రాయం వ్యక్తమైంది. దీనికోసం అన్నదాతలను ఆదుకునే పథకాలు ఉంటే బాగుంటుందని, రైతుబంధు మాదిరిగానే రైతు భరోసాను బేషరతుగా అమలు చేయాలనే డిమాండ్లు వచ్చాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో వ్యవసాయ శాఖ అధికారులు దీనిపై అభిప్రాయాలు సేకరించారు. కాగా రైతు భరోసాపై ఇప్పటికే రైతుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుందని.. నిబంధనల విషయంలో ప్రభుత్వం రోజుకో మాట చెబుతుందని కాంగ్రెస్ నాయకులే వెల్లడించారు.

వానకాలం, యాసంగి సీజన్లకు అనువుగా రైతు భరోసాను రైతుబంధు మాదిరిగానే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల అన్నదాతలకు పెట్టుబడి సాయం సమయానికి అంది వ్యవసాయంపై ఆధారపడిన అనేక రంగాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కార్యక్రమంపై మాట తప్పిందని విమర్శలు వస్తున్నాయని బీఆర్‌ఎస్ మద్దతుదారులు కొందరు నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూన్, డిసెంబర్‌లో రైతు బంధుకు సంబంధించిన డబ్బులు పడేవని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పిందని, ఇప్పటికైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేకపోతే రైతులు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కాగా రైతులు బ్యాంకుల్లో రూ.లక్ష రుణం తీసుకోవాలన్నా ఆదాయపు పన్ను చెల్లించడం తప్పనిసరి అని, దీన్ని సాకుగా చూపి రైతు భరోసా అందకుండా చేసే ప్రయత్నం జరుగుతుందని విమర్శలు వస్తున్నాయి. అందుకే బేషరతుగా రైతు భరోసా అమలు చేయాలని మెజార్టీ రైతులు అభిప్రాయాలను వెల్లడించారు. రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు.

### పదెకరాలకూ ఇవ్వాలి..



పదెకరాల వరకు రైతుభరోసా ఇవ్వాల్సిందే. రైతు భరోసాను ఎన్ని ఎకరాల భూమి ఉన్న వారికి ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం రైతు అభిప్రాయ సేకరణ హర్షించదగ్గ విషయం. మెజార్టీ రైతులు కోరుకుంటున్న విధంగా పదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు భరోసా వేయాలి. గతంలో రియల్ ఎస్టేట్‌గా మార్చిన భూములకు కూడా పెట్టుబడి సాయం పొందారు. అలాంటి భూములను సర్వే చేసి తొలగించి నిజమైన రైతులకు సాయం అందించాలి.

*- వెంకటయ్యయాదవ్, రైతు, తూడుకుర్తి*

## అవకాశమే రాలే..!

- రైతుబంధుపై అభిప్రాయాలు తీసుకోని మంత్రివర్గ సబ్‌కమిటీ
- సాధారణ చర్చలతో 'రైతు నేస్తం' కార్యక్రమం
- పీఎం కిసాన్ సమ్మాన్‌నిధికి సమస్యలు ఏకరువు పెట్టిన రైతులు


కిసాన్ సమ్మాన్‌నిధి రావడం లేదని నాగవరం రైతువేదికలో ఏఈవోకు విన్నవిస్తున్న రైతులు

వనపర్తి, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : రైతుబంధుపై మంత్రివర్గ సబ్‌కమిటీ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి కూడా అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన రైతునేస్తంలో రైతుల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని భావించింది. అయితే జిల్లాలోని రెండు రైతు వేదికల్లో మాత్రమే ఈ సమావేశాలు జరగగా ఇందులో రైతులకు లైవ్‌లో మాట్లాడే అవకాశమే రాలేదు. వనపర్తి మండలం నాగవరంలో జరిగిన సమావేశంలో డీఏవో సుధాకర్‌రెడ్డి, ఏవో కురుమయ్యతో పాటు ఏఈవోలు పాల్గొన్నారు.

***పీఎం కిసాన్ సమస్యలతోనే..***

రైతునేస్తం సమావేశానికి వచ్చిన రైతులంతా అధికంగా పీఎం కిసాన్ సమస్యలనే ఏకరువు పెట్టారు. లైవ్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రసంగాల వరకు కూర్చున్న రైతులు పీఎం కిసాన్ డబ్బులు పడడం లేదని మొరపెట్టుకున్నారు. వారు తెచ్చిన పట్టా సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లతో ఏఈవోలు, ఏవోల ముందుకు చేరి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సమావేశానికి వచ్చిన వారిలో ఎక్కువ మంది ఇదే సమస్యతో వచ్చారు. ఇదిలా ఉంటే.. రైతుబంధుపై అభిప్రాయాలను దరఖాస్తుల రూపంలోనూ తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నది. అయినా చాలా మంది రైతులు దానిపై దృష్టి పెట్టడం లేదు.

***జిల్లాలో 71 రైతువేదికలుంటే..***

జిల్లాలో 71 రైతు వేదికలు ఉండగా వీటిలో ఇప్పటి వరకు కొన్నింటిలో మాత్రమే లైవ్ కార్యక్రమాలు చూసుకొనే అవకాశం ఉన్నది. మిగతా చోట్ల ఇప్పటి వరకు టీవీలు రాకపోవడం తో లైవ్ కార్యక్రమాలకు ఆ ప్రాంత రైతులు దూరమవుతున్నారు. ఇప్పటి వరకు కేవలం 11 రైతు వేదికలకు మాత్రమే టీవీలు, ఇతర సామగ్రి వచ్చింది. వీటిలోనూ రెండుచోట్ల మాత్రమే సిద్ధం చేయడంతో అక్కడ మాత్రమే సమావేశాలు జరిగాయి. మిగిలిన చోట్ల ఆ వచ్చిన టీవీలను అమర్చకపోవడంతో ఎక్కడా సమావేశాలకు అవకాశం లేకుండా పోయింది.

## షరతులు వద్దు..

గద్వాల/మల్దకల్, జూన్ 25 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు భరోసా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన రైతునేస్తంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గద్వాల నియోజకవర్గానికి సంబంధించి మల్దకల్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులతోపాటు వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. రైతునేస్తంలో భాగంగా వానకాలం రైతుభరోసాకు సంబంధించి రైతుల నుంచి ప్రభుత్వం సూచనలు తీసుకొన్నది. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులను 'నమస్తే తెలంగాణ' పలకరించగా కింది విధంగా మాట్లాడారు.

### క్లారిటీ లేని సర్కారు



గత ప్రభుత్వం వానకాలం సీజన్ ప్రారంభం కాగానే ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రైతుబంధు సాయాన్ని వారి ఖాతాల్లో జమచేసేది. ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుబంధు సాయాన్ని అందించాలి. ఎన్నికల సమయంలో ఎటువంటి షరతులు లేకుండా రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు కొర్రీలు పెట్టడానికి చూస్తున్నది. ఇది పూర్తిగా రైతులను మోసం చేయడమే. కారు, బైక్ ఉన్నా అందరికీ రైతుబంధు ఇవ్వాలి. రైతు భరోసా చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి ఇప్పటి వరకు క్లారిటీ లేదు. ఒకసారి పంటకు ముందు వేస్తామంటారు. మరోసారి పంట మధ్యలో అంటారు. మరోసారి పొలంలో సాగు చేసిన పంట వివరాలు నమోదు చేసిన తర్వాత రైతు భరోసా ఇస్తామంటున్నారు. మంత్రులు చెప్పే మాటలు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి.

*- సత్యారెడ్డి, రైతు, గార్లపాడు*

### మాట నిలబెట్టుకోవాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం షరతులు లేకుండా రైతు భరోసాను అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. పది ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తే చాలా మంది రైతులకు మేలు జరుగుతుంది. రైతులు విత్తులు విత్తుకునే సమయంలో రైతు భరోసా అందిస్తే సాయమందుతుంది. పంట మధ్యలో, చివరలో ఇస్తామంటే రైతులకు ఏ విధంగా ఉపయోగపడదు. మధ్యలో ఇస్తే అప్పులు చెల్లించడానికి కూడా రైతు భరోసా సరిపోదు. గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరే పంట పెట్టుబడిని మొదట్లోనే అందించి రైతులను ఆదుకోవాలి. అదే విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించాలి.

*- తిమ్మప్ప, రైతు, మల్దకల్*

### ఐటీ చెల్లిస్తున్న వారికీ ఇవ్వాలి..



పదెకరాల వరకు రైతు భరోసా అందించడమే కాకుండా ప్రభుత్వం ఆదాయ పన్ను కడుతున్న రైతులకు కూడా పెట్టుబడి సాయాన్ని అందించాలి. ఆదాయ పన్ను కట్టే వారికి రైతు భరోసా ఇవ్వొద్దని చెప్పడం సరి కాదు. చిన్నచిన్న వ్యాపారాల కోసం, బ్యాంకు రుణాలు పొందడానికి సన్నకారు రైతులు ఆదాయపన్ను చెల్లిస్తున్నారు. అలాంటి వారికి రైతు భరోసా ఇవ్వకూడదని నిర్ణయించడం ఎంత వరకు సమంజసం. ప్లాట్లు, బీడు భూములు, వందల ఎకరాల్లో తోటలు పెట్టుకున్న వారికి ప్రభుత్వ సాయం ఇవ్వకున్నా సరిపోతుంది. కానీ పది ఎకరాల వరకు మాత్రం రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. ఏటా ఒకే రకం పంటలు చే యకుండా వివిధ రకాల పంటల సాగు చేసుకునేలా అవగాహన కల్పించాలి.

*- గౌని నాగేశ్వర్‌రెడ్డి, రైతు, కాంగ్రెస్ నేత, గోటూర్, ధన్వాడ మండలం, నారాయణపేట జిల్లా*